క్లుప్తంగా

సొంత నిధులతో బోరు ఏర్పాటు



బోరు తవ్వకం చేపడుతున్న దృశ్యం

సరుబుజ్జిలి: సరుబుజ్జిలికి చెందిన పాతిన రాజులమ్మ తన సొంత నిధులతో గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద గురువారం తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. భర్త కృష్ణమూర్తి జ్ఞాపకార్థం బోరు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్మశాన వాటికలో నీటి సదుపాయం లేక అంత్యక్రియలు చేపట్టే సమయంలో గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నట్లు తెలిపారు. తన భర్త కృష్ణమూర్తి అంత్యక్రియల సమయంలోనూ నీరులేక కష్టాలు పడినట్లు చెప్పారు. శ్మశాన వాటికలో నీటి సదుపాయం కల్పించిన రాజులమ్మకు గ్రామస్తులు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



ప్రసాదరావు

పాతపట్నం: పాతపట్నం తహసీల్దార్‌గా నందిగాం ప్రసాదరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రణస్థలం తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సనపల కిరణ్‌కుమార్ రణస్థలం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ప్రసాదరావుకు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు.

బయోమెట్రిక్ తప్పనిసరి



బయోమెట్రిక్ చేయిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు అర్హులు కావాలంటే ఈ నెల 20వ తేదీలోగా బయోమెట్రిక్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి దానకర్ణుడు అన్నారు. శనివారం మర్రిపాడు'సి' గ్రామంలో పలువురు రైతులతో బయోమెట్రిక్ చేయించారు. ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా చాపర



చాపర సుధాకర్

ఆమదాలవలస: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఆమదాలవలస పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు చాపర సుధాకర్ నియమితులైనట్లు శనివారం ఉత్తర్వులు వెలవడ్డాయి. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి ప్రభుత్వం 8 మంది సభ్యులతో కూడిన కొత్త ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియామకం చేపట్టినట్లు సుధాకర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో హెల్త్ యూనివర్సిటీకి జిల్లాకు చెందిన సుధాకర్‌ను ఎంపిక చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. జిల్లాకు మొదటిసారిగా ఈ అవకాశం కల్పించారు. సీఎం చంద్రబాబుకు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు డాక్టర్ సుధాకర్ కృతజ్ఞతలు తెలియజేశారు.


కార్డెన్ సెర్చ్



సీజ్ చేసిన బైక్‌లను ప్రదర్శిస్తున్న పోలీసులు

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామంలో స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక ఆధ్వర్యంలో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేకువ జామున ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. పూర్తిస్థాయి రికార్డుల్లేని 9 బైకులను సీజ్ చేశారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే వివరాలు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలను ఎవరైనా విక్రయిస్తే తెలియజేయాలన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని పలువురు బ్రహ్మకుమారీలు అన్నారు. శనివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చాపర త్రిలోక్ భవన్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువకులు ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌కు చెందిన వైద్యుల తోపాటు బ్రహ్మకుమారీలు సుధారాణి, మోహిణి, బి.కె.రాజ్యలక్ష్మి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

రోగుల అవస్థలు..!



వరండాలో రోగులకు వైద్యం అందిస్తున్న వైనం (ఫైల్)



కొత్తూరు సీహెచ్‌సీ



పూర్తికాని అదనపు గదులు



జనరేటర్ లేకపోవడంతో చిన్నారులను ఫోన్ వెలుతురులో ఉంచిన బాలింతలు (ఫైల్)

- కొత్తూరు సీహెచ్‌సీలో సమస్యలు వెల్లువ
- జనరేటర్ లేకపోవడంతో చీకట్లోనే రోగులు
- ఎక్స్‌రే మిషన్ లేకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు పరుగులు
- ఎనస్తీషియన్ లేకపోవడంతో ఆపరేషన్లకు ఇబ్బంది
- వరండాల్లోనే రోగులకు వైద్యం

కొత్తూరు: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు, సీతంపేట, భామిని, హిరమండలం మండలాలకు అందుబాటులో ఉన్న కొత్తూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందని పరిస్థితి. అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్తూరు సీహెచ్‌సీని కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పిస్తామని కూటమి నేతలు గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఏడాది కావస్తున్నా ఆస్పత్రిలో జనరేటరైనా ఏర్పాటు చేయలేకపోయారు. ఆస్పత్రికి వైద్యం కోసం రోజుకు సుమారు 200 మంది రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగా రోజుకు సుమారు 25 మంది వైద్యం పొందుతుంటారు. ఆస్పత్రిలో సరిపడిన గదులు లేకపోవడంతో వరండాల్లోనే మంచాలు వేసి వైద్యం అందించాల్సిన దుస్థితి. జనరేటర్ లేకపోవడంతో రోగులు చీకటల్లోనే ఉండాల్సిన పరిస్థితి. ఎక్స్‌రే ప్రాజెక్టు లేకపోవడంతో చిన్నపాటి ఎక్స్‌రే కోసం కూడా ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి వందలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆస్పత్రిలో ఎమ్‌డీ, గైనికాలజిస్టు, ఎం.ఎస్ వైద్యులతోపాటు పలువురు వైద్య నిపుణులు ఉన్నప్పటికీ ఎనస్తీషియన్ లేకపోవడంతో పలు రకాల శస్త్రచికిత్సలు చేయడానికి అవకాశం లేదు. ఆస్పత్రిలో 9 తొమ్మిది మందికి ఏడుగురు వైద్యులు పని చేస్తున్నారు. ఇద్దరు వైద్యులు, ఫార్మాసిస్టు, స్టాఫ్‌నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రూ.పది కోట్లతో నిర్మిస్తున్న అదనపు భవనాలు పూర్తికాలేదు. ప్రహరీ లేకపోవడంతో ఆస్పత్రిలోకి కుక్కలు, పందులు, పశువులు రావడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న కొత్తూరు సీహెచ్‌సీ ఉన్నప్పటికీ నిధులు రాబట్టుకోవడంలో కూటమి నేతలు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొత్తూరు సీహెచ్‌సీలోని సమస్యలు పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జనరేటర్ ఏర్పాటు చేయాలి..



ఆస్పత్రికి జనరేటర్‌ను ప్రభుత్వం మంజూరు చేయాలి. జనరేటర్ లేకపోవడంతో చిన్నపిల్లల వార్డులో పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. చీకటిలో రోగులు ఉండేందుకు భయపడుతున్నారు.

– బూరాడ భాస్కరరావు, పాతపాడు, కొత్తూరు మండలం

ఎనస్తీషియన్‌ను నియమించాలి



కొత్తూరు సీహెచ్‌సీలో ఎనస్తీషియన్‌ను నియమించాలి. ప్రసవాలు, ఇతర శస్త్ర చికిత్సల సమయాల్లో ఎనస్తీషియన్ లేకపోవడంతో శ్రీకాకుళం, పాలకొండ వంటి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది.

– గండివలస ఆనందరావు, కొత్తూరు, కొత్తూరు మండలం

జనరేటర్ లేదు..



కొత్తూరు సీహెచ్‌సీకి ప్రభుత్వం జనరేటర్ మంజూరు చేయలేదు. విద్యుత్ లేని సమయంలో ఇన్వర్టర్ సాయంతో వైద్యం అందిస్తున్నాం. విద్యుత్ గంటల తరబడి రాకపోతే ఇన్వర్టర్ చార్జింగ్ అయిపోయి రోగులు ఇబ్బంది పడుతున్నారు. అదనపు భవనాలు ప్రారంభమైనప్పుడు జనరేటర్‌తోపాటు ఎక్స్‌రే మిషన్ ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

– అనురాధ, సూపరింటెండెంట్, కొత్తూరు సీహెచ్‌సీ

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో మంత్రి లోకేష్ రూపొందించిన రెడ్‌బుక్ రాజ్యాంగ్యాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. పత్రికా స్వేచ్ఛను హరించి తన అనుకూల మీడియాను పెంచి పోషిస్తున్న చంద్రబాబుకు, కూటమి నాయకులకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఓ హెచ్చరిక అని అన్నారు. కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు అక్రమమని సుప్రీం తీర్పుతో రుజువైందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్న సుప్రీం కోర్టు వ్యాఖ్యలు రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతున్నాయన్నారు. సాక్షి మీడియా గ్రూప్‌ను కూటమి నాయకులు లక్ష్యంగా చేసుకుని నాశనం చేయాలనుకోవటం అత్యంత హేయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి కార్యాలయాలపై కూటమి నాయకులు దాడులు చేయటం ప్రభుత్వ అరాచకాలకు నిదర్శనమన్నారు. సాక్షి ఉద్యోగులను, సిబ్బందిని, జర్నలిస్టులను భయపెట్టి సీఎం చంద్రబాబు పరిపాలన కొనసాగించాలనుకోవటం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ అరెస్టులు ఆపాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిజాయితీతో పరిపాలన చేశారన్నారు. రాజకీయ పార్టీలతో పనిలేకుండా అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించారన్నారు.

నేటి నుంచి పైడితల్లి పండగ



పైడితల్లి అమ్మవారి ఆలయం



హనుమాన్ సెట్

పొందూరు: ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పొందూరు పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 16 ఏళ్ల తరువాత ఈ పండగను పొందూరుతోపాటు కృష్ణాపురం, లక్ష్మీపేట, జోగన్నపేట, ఎరుకలపేట, అలబోయినపేట, ఎరుకులపేట, ఎరుకుల కాలనీ గ్రామాల ప్రజలు నిర్వహిస్తారాన్నరు. ఇతర జిల్లాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి బంధువులు, స్నేహితులు వస్తున్నారన్నారు. 15న అమ్మవారికి ప్రత్యేక పూజలు, 16న మోటు పద్దులు 11 అడుగుల బొమ్మలు ప్రదర్శన, 17న రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా, సినీ సంగీత విభావరి, మాధవ్ ఈవెంట్స్ ఉంటాయన్నారు. గ్రామమంతా విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేశారు. హనుమాన్ సెట్, కటౌట్‌లతో అలంకరించారు.

పండగకు ప్రజలు సహకరించాలి



మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

పొందూరు: పొందూరు పైడితల్లి అమ్మవారి పండగకు సంబంధించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు సీఐ పి.సత్యనారాయణ తెలిపారు. పండగ ఏర్పాట్లపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పట్టణ వాసుల వాహనాలతోపాటు పండగకు వచ్చేవారి వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించామన్నారు. ఇప్పటికే నిర్దేశించిన రూట్లలో నుంచి మాత్రమే పొందూరు పట్టణంలోకి వాహనదారులు ప్రవేశించాలని కోరారు. ఈ మేరకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

ఉపాధి పనులపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

బూర్జ: మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరంలో వేతనదారులు చేపట్టిన పనులు గుర్తింపు, నిర్వహణ, చెల్లింపులు గూర్చి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సామాజిక తనిఖీ అధికారులు, సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ, ఎంపీటీసీ సభ్యుడు చొక్కర పోలినాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వంశధార ఈఈ బదిలీ

నరసన్నపేట: స్థానిక వంశధార మెయింటెనెన్స్ డివిజన్ ఈఈ ప్రదీప్‌కుమార్‌కు పార్వతీపురం నీటిపారుదల శాఖ (ఇరిగేషన్) ఈఈగా శనివారం బదిలీ అయింది. గత ఆరేళ్లగా నరసన్నపేటలో ఈఈగా పనిచేశారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో నీటి రెగ్యులేషన్ సజావుగా జరిగేందుకు పూర్తిస్థాయి ఈఈని నియమించాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం



సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వటం జరుగుతుందని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని ఫాక్సుదొరపేట గ్రామం సమీపంలో రెండు రోజుల క్రితం వేసిన గాలుల కారణంగా పంట పొలాల్లో నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలను శనివారం పరిశీలించారు. పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాలను రోడ్డు పక్కనుంచి వేయాలని గ్రామస్తులు, రైతుల కోరారు. ఈ మేరకు వాటిని రోడ్డు పక్కనుంచి వేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. విద్యుత్‌శాఖ ఏఈ రాజశేఖర్, తహసీల్దార్ జె ఈశ్వరమ్మ, సర్పంచ్ వెలమల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

కిల్లాం ఛానల్ గట్టు ఆక్రమణ



చిన్న బొరిగివలస వద్ద ఛానల్ గట్టుపై వేసిన గడ్డివాము

నరసన్నపేట: మండలంలోని చిన్న బొరిగివలస గ్రామం వద్ద కిల్లాం ఛానల్ గట్టు ఆక్రమణకు గురైంది. ప్రభుత్వం స్థలం అయినప్పటికీ స్థానికులు ఆక్రమణలకు పాల్పడ్డారు. దీనిపై నీటిపారుదల అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. విలువైన ఈ స్థలం కబ్జా కాకుండా చూడాలని, కొలతలు వేసి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. ఇప్పటికే బొరిగివలస ప్రాంతంలో కిల్లాం ఛానల్ గట్టు పలుచోట్ల ఆక్రమణలకు గురైంది. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి అని గ్రామస్తులు అంటున్నారు. రెవెన్యూ, వంశధార అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు.

రేషన్ కావాలంటే.. 10 కిలో మీటర్లు వెళ్లాల్సిందే



పెద్దసవలాపురం రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకున్న కార్డుదారులు

సరుబుజ్జిలి: మూలసవలాపురం పంచాయతీ పరిధిలోని వ్యాసులపేట గ్రామస్తులు రేషన్ సరుకుల కోసం సుమారు 10 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. వ్యాసులుపేట గ్రామానికి చెందిన సుమారు 31 మంది రేషన్‌కార్డు దారులు తమ రేషన్ సరుకుల కోసం దాదాపు 10 కిలోమీటర్లు దూరంగల ఇస్కలపాలెం పంచాయతీ పెద్దసవలాపురం గ్రామానికి వెళ్లాల్సివస్తోందని కార్డుదారులు బెండి ప్రభాకరరావు, అప్పలనర్సింహులు, రామారావు, జయలక్ష్మి, గురుగుబెల్లి రామారావు, లక్ష్మణరావు శనివారం తెలిపారు.

కార్డుదారుల్లో అధిక శాతం వృద్ధులే ఉన్నారని, ప్రతి నెలా ఇలా తీసుకోవడం చాలా ఇబ్బంది అని తెలిపారు. అధికారులు స్పందించి తమ గ్రామ పంచాయితీ పరిధిలో సరకులు ఇప్పించాలని కోరుతున్నారు. ఇదే విషయమై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా వెంటనే పరిశీలించి కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రాఫిక్ సమస్య..



సారవకోట మండలంలో వ్యాపార కేంద్రంగా ఉన్న బుడితి మార్కెట్‌లో నిత్యం ట్రాఫిక్‌తో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుంది. దుకాణాలన్నీ రోడ్డుకు పక్కనే ఉండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ జంక్షన్ నుంచి చుట్టు పక్కల ఉన్న రైస్ మిల్లులు, గ్రానైట్ తరలించేందుకు భారీ వాహనాలు నిత్యం వస్తూపోతూ ఉంటాయి. ఈ భారీ లారీలు వచ్చే సమమంలో మిగిలిన వాహనాలు తప్పించుకోలేని పరిస్థితి. దీనిపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి కృషి చేసినా ఫలితం లేదని స్థానికులు అంటున్నారు.

– సారవకోట

అల్లుకున్న నిర్లక్ష్యం



ఈ చిత్రం మెళియాపుట్టి మండలంలోని టెక్కలి రహదారిలో మర్రిపాడు 'సి' గ్రామం వద్ద రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి దట్టంగా అల్లుకున్న తీగలు. వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ సరఫరాలో ఎప్పటికప్పుడు అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించి ఈ రహదారిలోని స్తంభాలకు ఉన్న తీగలు, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

– మెళియాపుట్టి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



నరసన్నపేట: యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

పాతపట్నం: ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ పి.చంద్రకుమారి అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో మండల స్థాయి మాస్ యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, వీఓఏలు, ఉపాధి, సచివాలయ ఉద్యోగులు హాజరై యోగాసనాలు వేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ కె.కరుణాకరరావు, యోగా శిక్షకులు రమేష్, ఉప తహసీల్దార్ వెంకటరమణ, ఈఓ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

రావివలసలో..

సరుబుజ్జిలి: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రావివలస సర్పంచ్ వండాన కృష్ణ తెలిపారు. పంచాయతీ పరిధిలో గల సచివాలయం ఉద్యోగులు, గ్రామస్తులతో కలిసి శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: యోగా జీవిత కాలంలో దినచర్యలో భాగం కావాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21వ తేదీన జరగనున్న యోగా దినోత్సవం తోపాటు ప్రతీరోజు ప్రతీ ఒక్కరూ యోగాసనాలు వేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రవిరాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.జ్యోతిలక్ష్మి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: యోగాసనాల్లో పాల్గొన్న గ్రామస్తులు



ఎల్.ఎన్.పేట: యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

నరసన్నపేటలో..

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం మాక్ యోగా శిబిరం మండల స్థాయిలో నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ రేణుక, మాకివలస ఆయుష్ వైద్యురాలు సీతామహలక్ష్మి తదితరులు పాల్గొని యోగాసనాల వల్ల కలిగే లాభాలను వివరించారు. పట్టణంలో ఉన్న పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



పాతపట్నం: యోగాసనాలు చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు